ప్రజాశక్తి
ఆదివారం 29 అక్టోబర్ 2023
5
పార్వతీపురం మన్యం



గొట్టివలస వద్ద ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోనిక గొట్టివలస వద్ద ఏడు ఏనుగుల గుంపు ఉందని జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి ప్రసూన శనివారం ఒక ప్రకటన తెలిపారు. గత పది రోజులుగా గొట్టివలస వద్ద ఏడు ఏనుగుల గుంపు ఉందని, కొద్ది రోజుల్లో ఇతర ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉందని అన్నారు. గొట్టివలస, దాలివలస, ఉద్దవోలు, శివ్వాం, కొత్తూరు, కోటన రామినాయుడు వలస, ఉల్లిభద్ర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. అలాగే ఒంటరి ఏనుగు హరి తోటపల్లి బ్యారేజ్ బేక్ వాటర్ వద్ద ఉందనితెలిపారు. చుట్టు పక్కల గ్రామాలైన జియ్యమ్మవలస మండలం బాసంగి, వెంకటరాజు పురం., కొమరాడ మండలం పాత నిమ్మలపాడు, పాత బిట్రపాడు, కళ్లికోట, పాత దుగ్గి, గునానపురం, పార్వతీపురం మండలం పాత మార్కొండిపుట్టి, నవిరి., గరుగుబిల్లి మండలం ఎర్రన్న గుడి, కోటన రామినాయుడు వలస గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

ఎండిన చెరువులు... బీటలు వారిన పొలాలు

మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితి కనిపిస్తోంది. ఈనెలలో పడాల్సిన సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడంతో గ్రామాల్లో చెరువులు ఎండిపోయిన పరిస్థితి ఏర్పడింది. వరి పొలాలు బీటలు వారుతున్నాయి. గడచిన 25రోజులుగా వర్షాలు పడకపోవడంతో కరువు మేఘాలు కమ్ముకున్నాయి. ఫలితంగా మండలంలోని 2500 ఎకరాల్లో వరి పంట దెబ్బ తినే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ఎండిపోయిన పాండీ చెరువును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ, ఇరిగేషన్ అధికారులు

- కమ్ముకుంటున్న కరువు మేఘాలు
- వరుణుడు కరుణించకపోతే 2 వేల ఎకరాల్లో నష్టం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కొత్తవలస, పిఎన్ బొడ్డవలస, కూర్మరాజుపేట, చంద్రప్పవలస, దేవు బుచ్చింపేట, బాగువలస, పురోహితునివలస, బోరబందలో వరి పొలాలు ఎండిపోతున్నాయి. మరో వారం రోజుల్లో నీటి తడి అందకపోతే వరి పొలాలు పూర్తిగా దెబ్బ తినే అవకాశం ఉంది. వరి పంట పొట్ట దశలో ఉన్న సమయంలో నీటి తడి అవసరం వుంది. ఈ దశలో నీరందకపోతే వరిగింజ పొల్లుగా మారనుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మండలంలో 6,460ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితి కారణంగా ఈ విస్తీర్ణంలో మూడోవంతు దెబ్బ తినే అవకాశం కనిపిస్తోంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో రైతులు

తీవ్ర వర్షాభావ పరిస్థితి కారణంగా వరి పంట చేతికొచ్చే సమయంలో దెబ్బ తినే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో అప్రమత్తమైన రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు నీటి తడి అందిస్తున్నారు. లేని రైతులు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. పిఎన్ బొడ్డవలస ప్రాంతంలో సాగు చేస్తున్న సుతాపల్లి గోవింద అనే రైతు సుమారు రూ.60వేలు ఖర్చు చేసి తన పొలానికి నీటి తడి అందించే ప్రయత్నం చేస్తున్నారు. పాచిపెంట మండలంలోని చినచీపురువలస, పెదచీపురు వలస, కందరివలస, గుంట మామిడి వలస గ్రామాల రైతులు తలో కొంత డబ్బు ఎత్తుకుని కర్రి వలస ఆనకట్ట ఎడమ కాలువ నీరు అందేలా చర్యలు తీసుకున్నారు.

ప్రతిపాదన పంపించాం

తీవ్ర వర్షాభావ పరిస్థితి కారణంగా మండలంలో 2వేల ఎకరాలకు పైగా వరి పొలాలు ఎండిపోతున్నాయి. తాజా పరిస్థితిని ఇరిగేషన్ అధికారులకు నివేదించాం. కర్రివలస ఆనకట్ట ఎడమ కాలువ ద్వారా కోస్టువలస నుంచి పాండీ చెరువుకు నీరు చేరేలా చూడాలని రైతులు కోరుతున్నారు. 200మీటర్ల మేర కాలువ పూడిక తీస్తే పాండీ చెరువుకు నీరు చేరుతుందని చెపుతున్నారు. మండలంలో 25రోజులుగా వర్షాభావ పరిస్థితి నెలకొంది. అక్టోబరులో 123 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ 24 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వారం రోజుల్లో నీటితడి అందకపోతే వరి పంట దెబ్బ తినే అవకాశం కనిపిస్తోంది.

మధుసూదనరావు, వ్యవసాయ శాఖ ఎడి, సాలూరు.

15ఏళ్లుగా కోరుతున్నాం

కోస్టువలస వరకు వస్తున్న కర్రివలస ఆనకట్ట ఎడమ కాలువ నీటిని పాండీ చెరువుకు చేరేలా చర్యలు తీసుకోవాలని గత 15ఏళ్లుగా కోరుతున్నాం. దీనిపై స్పందన లేదు. పాండీ చెరువుకు నీరొస్తే మండలంలోని 2వేల ఎకరాల్లో వరి పంటను రక్షించడానికి అవకాశం ఉంటుంది. లేకపోతే వరి పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికే 20మంది రైతులం సొంత డబ్బుతో కొంత వరకు కాలువ పూడిక తీత పనులు చేశాం. కొంతవరకు నీరు చేరింది. దీనికి రూ.60వేలు ఖర్చు చేశాం. మిగిలిన గ్రామాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలంటే 200మీటర్ల కాలువ పూడిక తీత పనులు చేయాలి.

సుతాపల్లి గోవింద, రైతు.

అప్రమత్తమైన అధికారులు

మండలంలో కరువు మేఘాలు కమ్ముకొస్తున్న తరుణంలో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి మండలంలో ఎండిపోయిన చెరువులను పరిశీలించారు. మండలంలోని పాండీ చెరువుని శనివారం వ్యవసాయ శాఖ ఎడి మధుసూదనరావు, ఎఒ అనురాధ పండా, పెద్దగెడ్డ ఎఇ సంధ్య పరిశీలించారు. పాండీ చెరువుకు 200మీటర్ల దూరం వరకు కర్రివలస ఆనకట్ట ఎడమ కాలువ ద్వారా నీరు వస్తోంది. ఆ నీటిని పాండీ చెరువుకు చేరేలా చేస్తే మండలంలోని మిగిలిన చెరువులకు నీరు సరఫరా అవుతుంది. తద్వారా 2వేల ఎకరాల్లో వరి పొలాలకు నీటితడి అందే అవకాశం ఉంది. కర్రివలస ఆనకట్ట ఎడమ కాలువ నుండి ఉన్న పిల్ల కాలువ పూడిక తీస్తే పాండీ చెరువుకు నీరు చేరుతుందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు కూడా పంపించారు. తమ వద్ద నిధులులేవని ఇరిగేషన్ అధికారులు చేతులెత్తేస్తున్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రత్యేక దష్టి సారించి నిధులు మంజూరు చేస్తే 200మీటర్ల పిల్ల కాలువ పూడిక తీసే అవకాశం ఉంది. లేకపోతే వారం రోజుల్లో నీటి తడి అందక మండలంలోని 2వేల ఎకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది. యుద్ధప్రాతిపదికన ఈ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



నీరులేక ఎండిపోతున్న వరిపంట

రైతుల ప్రతిపాదన నివేదిస్తాం

కర్రివలస ఆనకట్ట ఎడమ కాలువ ద్వారా కోస్టువలస వరకు నీరు చేరుతుంది. అక్కడ నుంచి కొత్తవలస పాండీ చెరువుకు నీరు చేరేలా కాలువ పూడిక తీయాలని రైతులు కోరుతున్నారు. 200మీటర్ల పొడవున కాలువ పూడిక తీస్తే పాండీ చెరువుకు నీరు చేరుతుందని రైతులు చెప్పారు. ఈ ప్రతిపాదన ఉన్నతాధికారులకు నివేదిస్తాను. పనులు చేయడానికి అంచనాతో నివేదిక అందజేస్తాను. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

సంధ్య, పెద్దగెడ్డ ఎఇ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు, హాజరైన అధికారులు

పత్తి కొనుగోలుకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ అర్.గోవింద రావు తెలిపారు. పత్తి రైతు నష్టపోకుండా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు విక్రయించేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన పత్తి పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మౌళిక సదుపాయాలు మేరకు కొన్ని ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సాలూరు మార్కెట్ యార్డ్‌లోని ప్రస్తుతం జిన్నింగ్ మిల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 1 నుంచి సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. జిల్లాలోని సుమారు 13,106 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా ఎకరాకు ఆరు క్వింటాలు చొప్పున 78 వేల క్వింటాళ్ల దిగుబడి అంచనా వేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల మేరకు క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7020గా ఉందని, ఆ ధరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే అధిక ధర మార్కెట్ లో లభిస్తే విక్రయించుకోవచ్చని అన్నారు. మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించి రైతు నష్టపోకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాలకు దళారులు, మధ్యవర్తులు వస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా మొబైల్ నంబర్ 9182361390 కు సంప్రదించాలని కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి కె .శ్రీను బాబు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.శశికుమార్, సాలూరు, పాలకొండ ఎఎంసి సెక్రటరీలు బి.భారతి, జి.స్రవంత్, సిఐ సిహెచ్.స్వామినాయుడు, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారి కె.రవిప్రసాద్, జిన్నింగ్ మిల్లు యజమాని ఎస్.కన్నన్, సాలూరు ఎఎంసి సూపర్వైజర్ ఎమ్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చి.. లేదనడం సిగ్గుచేటు : సిపిఎం

ప్రజాశక్తి - బెలగాం

పేదల ఇళ్ల స్థలాల కోసం పట్టాలిచ్చి, ఆ తర్వాత తాము ఇవ్వలేదని, వీటిని రద్దు చేస్తామని అధికారులు చెప్పడం సిగ్గుచేటని, అధికారులకే స్పష్టత లేకపోవడం విడ్డూరమని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, పట్టణ నాయకులు జి.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని బెలగాంలో 20ఏళ్లుగా నివాసముంటున్న 20 కుటుంబాలకు ఇళ్ల పట్టాలిచ్చారన్నారు. తీరా ఇళ్లు కట్టుకొనే సమయంలో ఆపేయండి అంటూ అధికారుల నుంచి ఒత్తిడి రావడం దారుణమన్నారు. ఎందుకంటే ఆ స్థలం చెరువు అని, ఆ విషయం తెలియక గతంలో అధికారులు పట్టాలు ఇచ్చారని అన్నారు. అయితే తెలిసే పట్టాలు ఇచ్చారా తెలియక పోతే 20 ఏళ్ల నుంచి స్థానికంగా ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చి ఇప్పుడు తెలియదనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అలాగే పార్వతీపురం రెవెన్యూ పరిధిలో ఉన్న అన్ని చెరువులు కబ్జాకు గురయ్యాయన్నారు. ఇందులో భాగంగా ఇటు నెల్లిచెరువు నుంచి దేవుడుబండ వరకు అన్ని కబ్జాకు గురయ్యాయన్నారు. ఈ చెరువుల్లో పెద్ద, పెద్ద ఇళ్లు, బంగ్లాలు, కార్యాలయాలు నిర్మించారని, అటవీశాఖకు కూడా గెస్ట్‌హౌస్‌కు స్థలం కేటాయించారని ఇంత జరుగుతున్నా పేదల పట్టాలను రద్దు చేస్తామనడం ఇంతకంటే దారుణం ఇంకేముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పేదలకు ఇచ్చిన పట్టాలను వారికే ఇప్పించి, ఇళ్ల పనులు ప్రారంభించాలని కృష్ణమూర్తి, జి.వెంకటరమణ డిమాండ్ చేశారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. శనివారం వాల్మీకి మహర్షి జయంతి పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో వాల్మీకి చిత్ర పటానికి జాయింట్ కలెక్టర్ అర్.గోవిందరావు పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు పాటుపడిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని పేర్కొన్నారు. వాల్మీకి రచించిన రామాయణం నేటి తరానికి ఆదర్శంగా నిలిచిందని, తన రచన సాహిత్యంతో సమాజాన్ని చైతన్య పరచారని తెలిపారు. యువత మహనీయుల జీవితాన్ని ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకొని వారి అడుగుజాడల్లో పయనించి జీవిత లక్ష్యాన్ని దీక్ష, పట్టుదలతో ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. రెండు పక్షుల్లో ఒకటి మరణించిన సందర్భంలో శోకం నుంచి మొట్టమొదటి శ్లోకం మనకు అందించిన మహర్షి మన వాల్మీకి అని కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ జల్లేపల్లి వెంకట రావు, బిసి సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి ఉమా మహేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటిడిఎలో వాల్మీకీ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎపిఒ వై.రోసిరెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఒక గొప్ప కవివర్యులు అని కొనియాడారు. కార్యక్రమంలో డీడీ మంగవేణి, ఏఎంవో కోటిబాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : స్థానిక ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ వాల్మీకి చిత్రపటానికి అర్పించారు. అనంతరం ఆయన వాల్మీకి ప్రబోధించిన ఆశయాలను, పవిత్రమైన ఆలోచనలను ప్రతి ఒక్కరూ జ్ఞప్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఎస్బీ సిఐ లక్ష్మణరావు, ఆర్ఐలు , డిపిఓ లోని వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంటు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ఆప్కాస్ ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రదర్శనలో భాగంగా జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ పట్టణాల్లోని మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ పర్మినెంట్ ఆప్కాస్ విధానం కార్మికులచే మున్సిపల్ ఆఫీసు నుండి నాలుగు రోడ్లు కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో తమ ప్రభుత్వం రాగానే ఆరు నెలల్లో పారిశుధ్య కార్మికులందర్నీ పర్మినెంట్ చేస్తామని వాగ్దానం చేశారని, ఆ హామీ ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. కావున ఆప్కాస్ ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘ నాయకులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, నాగవంశం శివ, గంగరాజు, గంగయ్య, శివప్రసాద్, ఆనంద్, హరి, జలగడుగుల శాంతి, ఇప్పలమ్మ, పాపులమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా సహాధ్యక్షులు టి.శంకరావు ఆధ్వర్యాన కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 11 వ పీఆర్సీ ప్రకారం కార్మికులకు రూ.20వేలు వేతనం ఇవ్వాల్సి వుండగా రూ.15వేలే చెల్లిస్తున్నారని చెప్పారు. కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రంలో మాదిరిగా కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సహకార్యదర్శి టి.వెంకటరావు, నాయకులు పోలరాజు, మహిళా నాయకులు సీత పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద విధులకు హాజరైన కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో చేపట్టే అన్ని కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కార్మికులంతా పాల్గొని జయప్రదం చేస్తామని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి గారికి సంతకాలతో కూడిన మెయిల్ కూడా పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతల సంజీవి సురేష్, శ్రీదేవి, రఘు విమల, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల మున్సిపల్ కార్మికుల నిరసన



ఆందోళననుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వెంకటరమణ



సాలూరు : మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అక్టోబర్ మాసాంతపు నేర సమీక్షా సమావేశం నిర్వహించి, నమోదైన, దర్యాప్తులో ఉన్న నేరాల కేసులను సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న గ్రేవ్, ఎన్‌డిపిఎస్, ఐటి యాక్ట్ కేసులు, మహిళలపై జరిగే అన్యాయాలు, ప్రాపర్టీ దొంగతనాలు వంటి కేసుల గురించిన వివరాలు రిజన్‌వైజ్‌గా విశ్లేషించి వాటి దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమీక్ష నిర్వహించి తగు నిర్దేశాలు జారీచేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, రోడ్డు భద్రతా నియమాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పించి వాహన తనిఖీలు చేపట్టాలని, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలని, ఎంవి నిబంధనలు అతిక్రమించిన వారిపై చలానాలు విధించాలని, బైకు, ఇండ్ల దొంగతనాలు జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అక్రమ మద్యం అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై దృష్టి సారించి అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని, 174 సిఆర్‌పిసి కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు జరిపాలన్నారు. అదృశ్యం కేసుల్లో దర్యాప్తు చేసి, తప్పిపోయిన వారిని పట్టుకోవాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత కోర్టులో ఛార్జ్ షీట్లు సమర్పించాలని ఆదేశించారు. ప్రాధాన్యత కేసుల గురించి అడిగి తెలుసుకొని వాటిలో శిక్షలు పడేలా చేసి బాధితులకు న్యాయం జరిగేలచేయాలని సూచించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో హత్య కేసులో ముద్దాయిలకు కఠిన శిక్ష పడేలా కృషి చేసిన పాచిపెంట కోర్టు కానిస్టేబుల్ రామ్మోహన్, కంప్యూటర్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలను అందజేసారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ఎఎస్‌పి డాక్టర్ దిలీప్ కిరణ్, దిశా డిఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, డిఎస్‌పిలు జివి కృష్ణారావు, జి.మురళీధర్, సిఐలు సిహెచ్.లక్ష్మణరావు, ఎన్‌వి ప్రభాకరరావు, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

4,5 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నవంబరు 4,5, డిసెంబరు 2,3 తేదీల్లో జరుగుతుందని రెవెన్యూ డివిజనల్ అధికారి, పార్వతీపురం నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి కె హేమలత అన్నారు. ముసాయిదా ఓటరు జాబితా అనంతరం చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై తన కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ పై తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. ముసాయిదా ఓటరు జాబితాపై క్లైములు, అభ్యంతరాలను అక్టోబర్ 27 నుండి డిసెంబరు 9 వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించాలని, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు ఉండాలని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు వద్ద ఫారం - 6, ఫారం - 7, ఫారం - 8 అందుబాటులో ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఒకేసారి పెద్ద ఎత్తున ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించరాదని ఆమె తెలిపారు. 2024 జనవరి 1 నాటికి అన్ని ప్రక్రియలు పూర్తి చేసి 2024 జనవరి 5న తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని, ఆ మేరకు తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించి ఆదర్శంగా నిలవడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రంలో తాగు నీరు, విద్యుత్, ర్యాంప్ లు తదితర కనీస మౌలిక సదుపాయాలు ఉన్నవీ, లేనివీ పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆమె ఆదేశించారు.

30న వీరఘట్టంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని రెండో సచివాలయ పరిధిలో ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తోటపల్లి దేవస్థానం ఇఒగా సూర్యనారాయణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి కోదండ రామాలయం దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సూర్యనారాయణ నిమితులయ్యారు. గత ఇఒ బుద్ధ మహాలక్ష్మి గణేష్ నుంచి శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టిటిడి ఎస్‌టి మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయ్‌రావు, ఎండోమెంట్ బోర్డ్ ఛైర్మన్ ఎం.సత్యనారాయణ, ఇతర ట్రస్టీలు పాల్గొన్నారు.



ఇఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి
www.prajasakti.com



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

సంక్షేమ పథకాల అమలు ఘనత మాదే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. స్థానిక బిఎస్ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైసిపి మండల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత కాపు నేస్తం, రైతు భరోసా ఇటువంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలులో ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రచారం చేయాలని అన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో వైసిపి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, వాలంటీర్లు కలిసికట్టుగా పనిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపిపి కె.దీనమయ్య, జెడ్‌పిటిసి సభ్యులు రాధిక, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వెంకంపేటలో ఇంటింటికి కొళాయి పనులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్



కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వెంకంపేటలో రూ.19లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికి తాగునీరందేందుకు ఉద్దేశించిన పథకాన్ని సర్పంచ్ తీళ్ల కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరందించి, గ్రామాల్లో తాగునీటికి కొరత లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పనులు త్వరగా పూర్తిచేసి వెంటనే తాగునీరందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సిద్ధా జగన్నాధరావు, బంకురు రవికుమార్, మండలపార్టీ అధ్యక్షులు బొమ్మిరమేష్, నాయకులు మజ్జిచంద్రశేఖర్, తీళ్ల మాధవ, భీమవరపు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షులుగా దేవీచంద్రమౌళి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్



అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన దేవీ చంద్రమౌళి, చంద్రమౌళి

టిడిపి మండల అధ్యక్షకార్యదర్శులుగా బోను దేవీచంద్రమౌళి (చంటి), గొరజాన చంద్రమౌళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పార్వతీపురం లయన్స్‌కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పూర్తిస్థాయి నాయకత్వం అవసరమైనందున మండల పార్టీ నిర్ణయం మేరకు వీరువుర్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. చినబొండపల్లికి చెందిన దేవీచంద్రమౌళి(చంటి) గతంలో సర్పంచ్‌గానూ, పార్టీ అధ్యక్షుడుగా సేవలు అందించారన్నారు. అలాగే సూడిగాం పంచాయతీలో సర్పంచ్‌గా ఎక్కువ కాలం సేవలు అందించిన గొర జానకమ్మ కుమారుడైన చంద్రమౌళి గతంలో పార్టీ కార్యదర్శిగా సేవలు అందించిన విశేష అనుభవం ఉన్న దృష్ట్యా వీరిసేవలు వినియోగించుకుని పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. గతంలో మండల పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన దొగ్గ మోహనరావుకు 98 డివిజన్ ఉపాధ్యక్షుడిగా ఉద్యోగం రావడంతో ఈ ఎన్నిక జరిగింది.



పేదలకు దుస్తులు అందజేస్తున్న లక్ష్మణరావు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగికి చెందిన పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, సుమతి శనివారం 150 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. తమ కుమారుడు కీర్తిశేషులు పొట్నూరు ముకేశ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆతని జ్ఞాపకార్థం వీటిని అందజేశారు. రూ.20 వేలు విలువ గల దుస్తులను పేదలకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అజంగిని విజయమ్మ- ఎలియా, ఎంపిటిసి సభ్యులు సతివాడ వరలక్ష్మి- చిన్నమనాయుడు, పరిశినాయుడు తదితరులు పాల్గొన్నారు.



కురసింగిలో గిరిజనులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న గేదెల రవి

సమస్యల పరిష్కారానికే గ్రామదర్శిని

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గంలో గిరిజనుల సమస్యలు పరిష్కారానికి గ్రామదర్శిని నిర్వహిస్తున్నామని మన్య ప్రగతి చైర్మన్ గేదెల రవి పిలుపునిచ్చారు. సీతంపేట ఏజెన్సీలో సిరి, కురసింగి తదితర గ్రామాలను గ్రామ దర్శిని ద్వారా శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో సమస్యలు తెలుసుకొని, వాటిని ఉన్నతాధికారుల వద్దకు తీసుకొని వెళ్లి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు. గిరిజన సమస్యలు నిరంతరం తెలుసుకొని గిరిజన గ్రామాల్లో గల సమస్యలపైన తాగునీరు, రహదారుల వంటివి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మన్య ప్రగతి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు, సంస్కృతి - సంప్రదాయాలు, గ్రామాల అభివృద్ధి మానవ సంబంధాలు పై గ్రామ దర్శిని - ద్వారా చైతన్య అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

తుమరాడలో గడపగడపకు...

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని తుమరాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, వైపి పాలవలస విక్రాంత్ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు కలపాక సూర్యప్రకాశరావు, వాకముడి అనిల్, నాయకులు చందక జగదీష్, లోలుగు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఈనెల 30న అసమానతల్లేని అభివృద్ధి కోసం పార్వతీపురం పట్టణంలో పాత బస్టాండ్ వద్ద సాయంత్రం 4 గంటలకు జరగబోవు ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు పాకల సన్యాసిరావు, కార్యకర్తలు పట్టణంలోని 24,25వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బస్సు యాత్రలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పాల్గొంటారని, కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీతంపేట: అసమానతల్లేని రాష్ట్ర అభివృద్ధి జరగాలని కోరుతూ సిపిఎం ప్రజా రక్షణ బస్సు యాత్రన ఈనెల 30న సీతంపేటలో ప్రారంభమవుతుందని, దీన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు కోరారు. ఈ యాత్రను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రారంభిస్తారన్నారు. ఈ యాత్రకు పార్టీ రాష్ట్ర కార్య దర్శి వి.శ్రీనివాస్ రావు నాయకత్వం వహిస్తారన్నారు. మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు.

కురుపాం : ఈనెల 30న జరిగే సిపిఎం ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, ఊలక వాసుదేవరావు అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో ప్రజా పరిరక్షణ భేరి సభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి దాసోహమైన వైసిపి, జనసేన, టిడిపి పార్టీలను ఎండగట్టాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఈ ప్రజా రక్షణ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు కె. సుబ్బారావమ్మ, ఎస్.పుణ్యవతి, ఎం.కృష్ణమూర్తి పాల్గొంటారని అన్నారు.



ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ వేదికను ముస్తాబు చేస్తున్న సిపిఎం నాయకులు

కావున పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు సిద్ధమవుతున్న వేదిక

కురుపాం : ఈనెల 30 తేదీన నియోజకవర్గ కురుపాం జరుగునున్న సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు శనివారం రాత్రి దగ్గరుండి సభా వేదిక కురుపాంలో ప్రధాన రహదారి, బహిరంగ సభ జరుగు రావాడ కూడలి వరకూ సిపిఎం జండాలను కట్టిస్తూ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పుణ్యవతి, కె.సుబ్బారావమ్మ, ఎం.కృష్ణమూర్తి పాల్గొంటున్నారని, కావున ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు విద్యార్థులను కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడాపరికరాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉల్లాసం, ఉత్సాహంతో పాటు చదువులోనూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మండలంలోని 61జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక ఉన్నత, ప్రాథమిక పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు క్రీడ పరికరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల బాలుర వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్ ఉమామహేశ్వరరావు, సీఆర్పీలు జగదీశ్వరరావు, జ్యోతి, ఎంఆర్‌సి సిబ్బంది వాసు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: విద్యార్థులకు క్రీడా పరికరాలను పంపిణీ చేసినట్టు మండలంలోని ఓని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని బలగ నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఆటలు ఆడేటప్పుడు ఏఏ జాగ్రత్తలు పాటించాలో పాఠశాల ఉపాధ్యాయులు వివరించారు.

కెవికెను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షితరాజు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కెవికెలో జరుగుతున్న అభివృద్ధి పనులు, గిరిజన రైతులకు అందుతున్న సేవలు గురించి ప్రోగ్రాం కోఆర్డినేటర్ టిఎస్‌కె పాత్రోని అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న వివిధ రకాలైన పూలు, పండ్ల మొక్కల డెమో యూనిట్లను పరిశీలించారు. అనంతరం గిరిజన రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి అధిక దిగుబడులు సాధించేలా కెవికె సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిఐలో స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఉచిత స్వల్పకాలిక శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు నవంబర్ 4లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. డ్రైవింగ్ శిక్షణ కోర్సుకు 8వతరగతి పాస్ అయి ఉండాలని తెలిపారు. సూయింగ్ మిషన్ కుట్టు మిషన్ 8వ తరగతి డేటా ఎంట్రీ ఆపరేటర్ ఏసి రిపేర్ శిక్షణ 10వ తరగతి ఉండాలని తెలిపారు.

టిడిపి గెలుపునకు సమిష్టిగా కృషి : శత్రుచర్ల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు పిలుపునిచ్చారు. జియమ్మవలస మండలం చినమేరంగి కోటలో మాజీ మంత్రి నాయకత్వంలో కురుపాం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఐదు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి చేయాల్సిన కృషి, భవిష్యత్తు ప్రణాళిక వంటి అంశాలపై మాట్లాడారు. 2024 ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరాలంటే ఇప్పటి నుంచే కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అరేటి మహేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ, అనుబంధ కమిటీ సభ్యులు, పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటి కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, నియోజకవర్గ అనుబంధ, మండల కమిటీ, యూనిట్ ఇంచార్జిలు, గ్రామ కమిటీ సభ్యులు, బూత్ ఇన్‌ఛార్జిలు, పార్టీ కార్యకర్తలు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల : అధికార వైసిపి టిడిపి ఓట్లను తొలగించి, వారికి అనుకూలమైన వారిని చేర్పించి ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే కుయుక్తులను టిడిపి కార్యకర్తలు, నాయకులు ధీటుగా ఎదుర్కొనాలని పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకుడు బోయిన గోవిందరాజులు అన్నారు. శనివారం స్థానిక లయిన్స్ కల్యాణ మండపంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో ఓటర్ వెరిఫికేషన్ "బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ" కార్యక్రమాలపై కార్యకర్తలకు, నాయకులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న నియోజకవర్గ పరిశీలికులు గోవిందరాజులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మాట్లాడుతూ పార్టీతో పాటు నాయకుడు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తాత్కాలికమేనని, దీన్ని సవాలుగా తీసుకుని క్షేత్రస్థాయిలో పోరాటపటిమతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నవంబర్ 1 నుంచి జరగబోయే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి బాబు ష్యూర్టీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం విజయవంతం చేయడానికి కార్యకర్తలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శత్రుచర్ల విజయరామరాజు

పాలకొండ : రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి వస్తుందన్ని ఆ పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. పట్టణంలోని నక్కలపేట కళ్యాణమండపంలో టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడ్ని అక్రమంగా అరెస్ట్ చేసి వైసిపి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. ఎన్ని కుట్రలు పన్నినా చంద్రబాబు అధికారంలోకి వస్తారన్నారు. బాబుతో నేను భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి పరిశీలకులు కలమట సాగర్, రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, నాయకులు పోదిలాపు కృష్ణమూర్తి, చంద్రరావు, నాగేశ్వరరావు, గంట సంతోష్, గండి రామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జెఎఎస్‌తో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలందుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని ఎమ్మార్‌నగరంలో పెదబొండపల్లి పిహెచ్‌సి వైద్యాధికారుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జెఎఎస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్ని శిబిరం అంతటా తిరిగి నిర్వహణా కార్యక్రమాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి శిబిరంలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగపండు లక్ష్మి, ఎంపిటిసి బడే రామారావు, ఎంపిపి మజ్జి శోభారాణి, నాయకులు బొమ్మి రమేష్, బంకురు రవికుమార్, మజ్జి చంద్రశేఖర్, భీమవరపు కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పెదభోగిలి సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎ.జోగారావు పాల్గొన్నారు. ఈ వైద్యశిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి వైద్యులను సంప్రదించి ఆయా గ్రామాల్లో ప్రధానంగా ప్రజలు ఏఏ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపిలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మండలాల అధికారులు, వైద్యులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాలూరు: పట్టణంలోని డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి స్పందన లభించింది. మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ హాజరైన కార్యక్రమంలో వైద్య సేవలు పొందడానికి రోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.జయరాం, మేనేజర్ రాఘవా చార్యులు, 20వార్డు ఇంఛార్జి పి.వాసుదేవరావు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని బియ్యాలవలస సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి శెట్టి పద్మావతి ప్రారంభించారు. ఈ శిబిరానికి బియ్యాలవలస, గుమ్మడిగూడ పంచాయతీ పరిధిలో గల 12 గిరిజన గ్రామాల నుంచి 674 మంది హాజరయ్యారు. వైద్యాధికారులు కె.సుమిని సుప్రియ, కె.కిరణ్, ఎ.లోకబహిన్, ఎ.సాయిప్రసాద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారని అన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు నిర్వహించిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొనే పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో బియ్యాలవలస సర్పంచ్ పువ్వుల అజారి, గుమ్మడిగూడ సర్పంచ్ శెట్టి సురేష్, జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.అనురాధ, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాం : జెఎఎస్ వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి పద్మావతి

గుమ్మలక్ష్మీపురం : ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందుతున్నాయని స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకరరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఎంపిడిఒ సాల్మన్‌రాజు, తహశీల్దార్ జె.రాములమ్మ, డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, ఐసిడిఎస్ పిఒ సుశీలాదేవి, పంచాయతీ కార్యదర్శి కిషోర్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి పేద కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ లక్ష్యమని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. మండలంలోని కొదమ పంచాయతీ మోనంగిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సర్పంచులు నూకయ్య, సుధాకర్, వైద్య, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గర్భిణీలకు, చిన్నారులకు టీకా తప్పనిసరి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గర్భిణీలకు, చిన్నారులకు టీకా తప్పనిసరని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని 22వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆ పరిధిలో ఎంతమంది పిల్లలు, గర్భిణీలకు టీకాలు వేయాల్సి ఉందనే వారి వివరాల నమోదును రికార్డుల్లో, టీకా కార్డులో పరిశీలించి పిల్లలకు టీకా వేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. టీకాల ఆవశ్యకతపై తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. కొత్తగా ప్రవేశపెట్టిన యూవిన్ పోర్టల్‌ను ఎఎన్ఎం హెల్త్ యాప్‌లో పరిశీలించి, టీకా పూర్తైన వారి వివరాలు వెంటనే నమోదు చేయాలని సూచించారు. టీకా సర్టిఫికేట్‌ను కూడా ఆన్లైన్‌లో పొందవచ్చని, అవసరమైన వారికి అందజేయాలన్నారు. పిల్లలు, గర్భిణీలకు పూర్తి స్థాయిలో టీకా జరిగేలా త్వరితగతిన పర్యవేక్షణ జరుగుతుందన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్యం పరిశీలించి, వారి బరువును స్వయంగా పరిశీలించి బరువు తక్కువగా గుర్తించిన పిల్లలకు పౌష్ఠికాహారం పూర్తి స్థాయిలో వినియోగించి వృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా యువతలో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కల్పించేందుకు సెప్టెంబరులో యువజన ఉత్సవాల్లో విద్యార్థులకు జిల్లా స్థాయిలో 5కె రెడ్ రన్- మారథాన్, జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆ పోటీలలో విజేతలకు శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టి.బి నియంత్రణ అధికారి డాక్టర్ ఎ.శ్యామ్ కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు, జిల్లా విద్యా శాఖ ఎడి ఎమ్. రామ జ్యోతి చేతుల మీదుగా సర్టిఫికెట్స్, ప్రైజ్ మనీ చెక్ రూపంలో అందజేశారు. ఇందులో గెలుపొందిన పది మంది విద్యార్థులను జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతుందని తెలియజేశారు. హెచ్ఐవి/ఎయిడ్స్ పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.5000 నగదు బహుమతి, రెండవ స్థానంలో రూ.4000, మూడవ స్థానంలో రూ.3000, నాల్గవ స్థానంలో రూ.2000 చొప్పున అందజేశారు. కార్యక్రమములో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి.బాలాజీ, డిస్ట్రిక్ట్ అకౌంట్ అసిస్టెంట్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ జంక్షన్లో ఆందోళన చేస్తున్న ట్రాక్టర్ల యజమానులు

ఇసుక రవాణాకు అనుమతులివ్వాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని, అక్రమంగా సీజ్ చేసిన ట్రాక్టర్లను విడుదల చేయాలని పెద్ద భోగి ఉప సర్పంచ్ కె.అరవింద్‌కుమార్, సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం హనుమాన్ జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక రవాణాకు అనుమతుల్లేవంటూ పోలీసులు ట్రాక్టర్లను తీసుకువెళ్లే కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఇసుక రవాణాకు అనుమతిచ్చి, సీజ్ చేసిన ట్రాక్టర్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.

వెలుగు భవనం మంజూరు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఐకెపి కార్యాలయానికి సొంత భవనం మంజూరు చేయాలని ఎపిఎం ఆర్.శ్రీరాములునాయుడు, మహిళా సమీక్ష అధ్యక్షులు జి.ప్రమీల ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీశక్తి భవనం కోసం గతంలో హామీ ఇచ్చారని, ఇప్పుడు కార్యాలయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి సొంత భవనానికి స్థలం నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిసిఎల్ కోటేశ్వరరావు, తిరణాల తదితరులు పాల్గొన్నారు.

గౌరీ మహిళా మండల సేవలు అభినందనయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో 2006 నుంచి శ్రీ గౌరీ మహిళా మండలి ఆధ్వర్యంలో వినియోగదారులకు సేవలు అందిస్తున్న సమాచార కేంద్రాన్ని జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కె.శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా 2006 నుంచి ఇప్పటి వరకు వినియోగదారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఇప్పటి వరకు గౌరీ మహిళా మండలి ఆధ్వర్యంలో ఎన్నో వందల కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ఇన్చార్జి పట్నాయకుని నాగమణి ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను చూపించారు. గత 15 ఏళ్లుగా పార్వతీపురం డివిజన్లో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మీ సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఆరిక సాంబమూర్తి ఉన్నారు.

అధికారుల పనితీరే అభివృద్ధికి కీలకం

ప్రజాశక్తి - కురుపాం

అధికారులు పనితీరు బాగుంటేనే ప్రభుత్వ శాఖలు అభివృద్ధి చెందుతాయని ఆర్‌డిఒ ఎం.లావణ్య అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలో గల హౌసింగ్ ఇంజనీరింగ్ మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మండలాల జగనన్న లేఅవుట్లు, నిర్మాణాలు, అనుబంధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఎంపిడిఒ వివి శివరామప్ప, నియోజకవర్గంలో గల మండల అధికారులు పాల్గొన్నారు.

పనులు కల్పించేందుకు చర్యలు

వీరఘట్టం : గ్రామాల్లోని పనులు కల్పించేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ ఉదయాన సూరి నారాయణ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని గడగమ్మ గ్రామ సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించడం జరుగుతుందని, జాబుకార్డు లేకపోతే తక్షణమే జాబ్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రజలను కోరారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి గ్రామంలో 34 పనులు గుర్తించడం జరిగిందని, వీటికి సంబంధించి రూ.41లక్షలతో పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ జి సత్యంనాయుడు, పంచాయతీ కార్యదర్శి కె.ఉష, టెక్నికల్, ఫీల్డ్ సహాయకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

'బాబుకు అండగా మేమున్నాం'

ప్రజాశక్తి - పాచిపెంట

కక్ష సాధింపుతోనే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును అరెస్టు చేశారని చంద్రన్నకు అండగా మేమున్నామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కొత్తవలసలో మండల పార్టీ అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో దోపిడీ రాజ్యం దొంగల రాజ్యం అంటూ వైసిపి ప్రభుత్వంపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదిరెడ్డి తులసీరాం, ముఖీ సూర్యనారాయణ, గూడెపు యుగంధర్, కొత్తల పోలినాయుడు, పూసర్ల నర్సింగరావు, నడిపల్లి మెహర్ బాబా, గొర్ల సత్యం, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

3న విద్యా సామర్థ్య పరీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీమెంట్ సర్వీస్ ఆధ్వర్యంలో విద్యా సామర్థ్య పరీక్ష నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు డి గౌర్నాయుడు, ఆర్.ఆనందరావు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మూడు, ఆరు, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటికి ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌గా డిగ్రీ చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేయనున్నామని, ఇందుకు సంబంధించి ఈ నెల 30న మండల స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. లాంగ్వేజ్, గణితం సబ్జెక్టులకు సంబంధించి పరీక్ష నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

నేరాలు ఘోరాలు

కడుపునొప్పి తాళలేక గృహిణి ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సీతానగరానికి ఒమ్మిదారపు కొండమ్మ కడుపునొప్పితో గత కొంతకాలంగా బాధపడుతుంది. బాధ ఎక్కువ కావడంతో తాళలేక శనివారం వేకువన జామున ఇంట్లో చీమల మందును నీటిలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నకు పాల్పడింది. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పో లీసులు చికిత్స అందిస్తున్నారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్యా యత్నం

గరుగుబిల్లికి చెందిన ముగడ గౌరునాయుడు మనస్థాపంతో శనివారం వేకువన తన ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. స్పందించిన కుటుంబీకులు జిల్లా కేంద్రాసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔటు పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.